క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా బాటసింగారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మంగళవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ విద్యారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాఫర్‌గూడ, సింగరేణికాలనీ, బ్రిలియంట్ కాలేజీ, జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న నివాస, వ్యాపార సముదాయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి సోమవారం యాచారం మండల బీఆర్‌ఎస్ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, పాశ్చ భాషా ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, యాచారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నాయకులు రవికిరణ్‌రెడ్డి, యాదయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళం అందజేస్తున్న సర్పంచ్ మంజుల

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ కొప్పు మంజుల రూ.1.5 లక్షలు విరాళం అందించారు. చింతలపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కొప్పు మంజుల విరాళాన్ని అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొప్పు యాదయ్య, రాంరెడ్డి, కుమార్, యాదయ్య, అంబేడ్కర్ కమిటీ ఉపాధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీను, నాయకులు నర్సింహ, జంగయ్య, రామకృష్ణ, కృష్ణయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసిన కసిరెడ్డి



నిరంజన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కసిరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయ శాఖా కమిషనర్ రఘునందన్‌రావ్‌తో కలిసి వ్యవసాయ శాఖ క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ కసిరెడ్డి ఆవిష్కరించారు.

ఆశ్రమానికి మతిస్థిమితం లేని వ్యక్తి



అనాథ ఆశ్రమ సిబ్బందికి వ్యక్తిని అప్పగిస్తున్న పోలీసులు

బడంగ్‌పేట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మన్నెగూడ ఎక్స్ రోడ్డులో స్థానికులతో గొడవ పడుతున్న మతిస్థిమితం లేని వ్యక్తి(38)ని పోలీసులు బడంగ్‌పేట పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ ఆశ్రమానికి అప్పగించారు. తన పేరు కరుణాకర్ అని బీఏ బీఈడీ పూర్తి చేసి టీచర్‌గా పనిచేస్తున్నట్లు ఆ వ్యక్తి చెబుతున్నాడు. ఇంగ్లిష్ బాగా మాట్లాడుతున్నాడని ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి తెలిపారు. ఎవరైనా ఈ వ్యక్తిని గుర్తు పడితే ఆశ్రమంలో సంప్రదించాలని ఆయన కోరారు.



ఆమనగల్లు: వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



ఇబ్రహీంపట్నం రూరల్: కిక్కిరిసిన దేవాలయం

ఏకాదశి శోభ

కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మహిళలు మంగళహారతులతో ఆలయాల చుట్టూ ప్రదక్షణలు చేశారు. పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు. – సాక్షి, నెట్‌వర్క్



తుర్కయంజాల్: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, నాయకులు



ఇబ్రహీంపట్నం: శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో..



కడ్తాల్: స్వామివారి పల్లకీ సేవ



హయత్‌నగర్: రంగనాథస్వామి ఆలయంలో..



తలకొండపల్లి: వేంకటేశ్వర స్వామి పల్లకీ సేవ

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన ఎంగి అనిల్ విద్యుదాఘాతంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వ్యక్తిగతంగా రూ.3000 ఆర్థికసాయం అందజేశారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం కాలేజ్ ఔట్‌రీచ్ రాష్ట్ర కన్వీనర్ పాండు, బీజేపీ జిల్లా కార్యదర్శి పాండు ప్రసాద్, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు, విజయ్, రాజు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

యాదమ్మ కుటుంబ సభ్యులకు..

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన వంగూర్ యాదమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వ్యక్తిగతంగా రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్, మల్లారెడ్డి, జంగారెడ్డి, దశరథం, రఘు, చెన్నయ్య, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి...

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, గౌరెల్లి గ్రామానికి చెందిన చింతకాలయ క్రిష్ణ గత డిసెంబర్ 1వ తేదీన మృతిచెందడంతో సహకార సంఘం తరఫున మృతుడి కుటుంబసభ్యులకు అందించే రూ.25ఆర్థిక సహాయాన్ని సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సంఘం కార్యాలయంలో సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి చేతుల మీదుగా మృతుడి కుమారుడు శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కందాడి మహిపాల్‌రెడ్డి, చేగూరి భరత్‌కుమార్, మేనేజర్ ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో కేంద్ర బృందం పర్యటన

మంచాల: మంచాల మండలంలోని ఆరుట్ల, తిప్పాయిగూడ గ్రామాల్లో ఈనెల 4, 5 తేదీల్లో కేంద్ర బృందం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర బృందం పరిశీలించనుందన్నారు. పంచాయతీ పాలకవర్గం కూడా అందుబాటులో ఉండాలని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పాండాల జంగయ్య గౌడ్, ఏపీఓ వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీనివాస్

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టు



ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు



తలకొండపల్లి: అరెస్టు అయిన కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అధిష్టానం పిలుపు మేరకు సోమవారం ఇందిరా పార్కు వద్ద కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపేందుకు వెళ్తుండగా ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. మర్రి నిరంజన్‌రెడ్డి, కొత్తకుర్మ శివకుమార్, మర్రి రాంరెడ్డి, బాల్‌రాజ్, బంగారి బాబు, కుంట గోపాల్‌రెడ్డి, మేతరి దర్శన్, యాదగిరి, మర్రి మహేందర్‌రెడ్డి, కామండ్ల యాదగిరి, భద్రయ్యను అరెస్టు చేశారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టినట్లు సీఐ రవికుమార్ తెలిపారు .

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

తలకొండపల్లి: అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. సర్పంచ్‌ల సమస్యలను పట్టించుకోకుండా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ నిధుల విషయంలో ఆడుతున్న డ్రామాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టాలని టీపీసీసీ రాష్ట్ర చీఫ్ రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు ధర్నాలు చేపట్టుతున్నట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సమచారం అందుకున్న పోలీసులు వారిని ముందస్తుగ అరెస్టు చేశారు. ధర్నాలు జరుపకుండా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు అయ్యిన వారిలో టిపిసిసి కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, మాజి ఎంపిటిసి రాములు, రాష్ట్ర నాయకులు డోకూరి ప్రబాకర్‌రెడ్డి, సోషల్‌మీడియా అసెంబ్లీ కన్వీనర్ అజీం, అసెంబ్లీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, తదితరులున్నారు.

విద్య, ఉపాధి కల్పనే 'ఐక్యత' లక్ష్యం



రాఘవేందర్‌రెడ్డిని సన్మానించిన గ్రామస్తులు

ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: నియోజకవర్గ ప్రజలకు విద్యా, వైద్యం ఉపాధి కల్పనే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పల్లె చెలక తండాలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. గత పర్యటన సందర్భంగా గ్రామంలో ఇచ్చిన హామీ మేరకు మత్యసాద్ స్వామి ఆలయ నిర్మాణ పనులను ఫౌండేషన్ ద్వారా ప్రారంభించారు. సర్పంచ్ లోకేశ్, ఎంపీటీసీ రాములుగౌడ్, ఉపసర్పంచ్ సీతరాం, ఫిరోజ్‌నగర్ సర్పంచ్ జంగయ్య, నాయకులు శ్రీను, నవీన్, మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఆ కులాలను తెలంగాణలో విలీనం చేయొద్దు

తెలంగాణ సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్



బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఏపీలోని 27 బీసీ కులాలను తెలంగాణ బీసీ కులాల్లో విలీనం చేయకూడదని కోరుతూ తెలంగాణ సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కులాలను తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాలలో కలిపితే బీసీల్లోని కులాలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంచార జాతుల సంఘం అధ్యయన కమిటీ చైర్మన్ వెంకట్ నారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు యువరాజ్ వంశరాజు, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, పెద్దమ్మల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, మందుల కుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ముత్తు, లక్ష్మణ్, బాలు పాల్గొన్నారు.

4న సర్వసభ్య సమావేశం

మాడ్గుల: మాడ్గుల మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాఘవులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా హాజరుకాగలరని ఎంపీడీఓ కోరారు.

విధుల్లో చేరిన వైద్యురాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత 6 నెలలుగా డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల కోరిక మేరకు ప్రభుత్వం డాక్టర్ ఖాళీ పోస్టును భర్తీ చేసింది. దీంతో సోమవారం డాక్టర్ సైదమ్మ గట్టుఇప్పలపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి విధుల్లో చేరింది. హెచ్ఈఓ రవికుమార్, ఫార్మసిస్టు మల్లేశ్, బాల్‌రాజ్, పద్మ, సునీత ఏఎన్ఎంలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

'పది' ప్రశ్నపత్రంలో చాయిస్‌లు పెంచాలి: ఎస్టీయూ

మంచాల: ఇటీవల పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పదవ తరగతి ప్రశ్నపత్రంలో కొంతమేర మార్పులు అవసరమని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుధాకర్ అభిప్రాయపడ్డారు. సోమవారం మంచాలలో ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నపత్రంలో అన్ని సెక్షన్‌లలో చాయిస్‌ను పెంచాలన్నారు. ఫిజికల్ సైన్స్, బయో సైన్స్ పరీక్షలు ఒకేరోజు గాకుండా వేరువేరుగా నిర్వహించడం వలన విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. పరీక్షకు, పరీక్షకు మధ్య ఒకరోజు విరామం ఉంచాలన్నారు. పరీక్ష విధానంలో మార్పులు చేయాలని, వెంటనే ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు.

అయ్యప్ప స్వాములకు వాటర్ బాటిళ్లు, నగదు



అయ్యప్ప స్వాములకు వాటర్‌బాటిళ్లు అందజేస్తున్న ఉమర్

ముస్లిం యువకుడి దాతృత్వం

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ ముస్లిం యువకుడు దాతృత్వం చాటుకున్నాడు. మతం ఏదైతేనేమి మనుషులంతా సమానమే అని చాటిచెప్పాడు. ఆదిబట్ల మున్సిపాలిటీకి చెందిన 24 మంది అయ్యప్ప మాలధారులు సోమవారం ఇరుముడితో శబరిమల యాత్రకు బయలుదేరారు. అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఉమర్.. వారికి వాటర్ బాటిళ్లు అందజేసి, తోచిన కాడికి నగదు అందజేసి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాడు. ఉమర్ గత మూడు సంవత్సరాలుగా ఇలాగే అయ్యప్ప భక్తులకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాడు. ఉమర్ ఒక్కడే కాకుండా అతడి కుటుంబ సభ్యులు మొత్తం ఆదరించి అయ్యప్ప స్వాములకు సేవ చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కులం, మతం కంటే మానవత్వం ముఖ్యమని చాటుచెబుతున్నాడు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఆమనగల్లు మండలం శంకరకొండ తండాకు చెందిన నందినికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరైన రూ.1.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, శంకరకొండ తండా ఉపసర్పంచ్ ప్రశాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర!

- ఇప్పటికే రూట్‌మ్యాప్ సిద్ధం
- తండ్రి, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఆశీస్సులతోనే అంటూ నేతల టాక్
- మూడు నెలల పాటు కొనసాగనున్న పాదయాత్ర



ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టేందుకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. తండ్రి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితోపాటు పార్టీ పెద్దల ఆశీస్సులతో ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తుంది. ఎల్మినేడులో సోమవారం విలేకరులతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడుతూ తన మనసులోని మాటను బయటపెట్టారు. టీడీపీ హయాంలో సంతోష్‌నగర్ కార్పొరేటర్‌గా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి(బంటి) గెలుపొంది పనిచేసిన సంగతి తెలిసిందే. తండ్రి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మూడు పర్యాయాలు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులుగా విజయం సాధించారు. ఈ దఫా జరిగే ఎన్నికల్లో తండ్రి స్థానం నుంచి ఎమ్మెల్యేగా బరిలోకి దిగి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ఇందుకు తండ్రి కిషన్‌రెడ్డి ఆశీర్వాదాలు నిండుగా ఉన్నాయని సమాచారం.

ఏడాదిగా ప్రజల్లోనే..

గత సంవత్సరం కాలం నుంచి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి వ్యూహాత్మకంగానే నియోజకవర్గంలో వినూత్న కార్యక్రమాలను చేపడుతూ.. ప్రజలతో, కార్యకర్తలతో మమేకమై తిరుగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోగా జనాల్లోకి వెళ్లి తన ఆశయాలను, లక్ష్యాలను ప్రజలకు వివరించి వారి ఆశీస్సులు పొందాలని ప్రశాంత్‌రెడ్డి వ్యూహంగా కనబడుతుంది. యాచారం మండలం నందివనపర్తి నుంచి ఈ పాదయాత్రను ప్రారంభించి అబ్దుల్లాపూర్‌మెట్ బాటసింగారం గ్రామంలో ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. సంక్రాంతి తర్వాత ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. టీఆర్‌ఎస్ ప్రభుత్వం, తన తండ్రి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి తెలియజేయడమేగాక భవిష్యత్‌లో తాను వారికి అండగా ఉంటాననే భరోసాను ఈ పాదయాత్ర ద్వారా కల్పించనున్నారు. మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి పాదయాత్రను ప్రజలు ఎంతవరకు రిసీవ్ చేసుకుంటారో వేచిచూడాల్సిందే.

రాజకీయ లబ్ధి కోసమే అసత్య ఆరోపణలు



విద్యార్థులతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు మంత్రి సబితారెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుంటే రాజకీయ లబ్ధి కోసం బీజేపీ అసత్య ఆరోపణలు చేస్తోందని టీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ జహంగీర్, యంజాల జనార్దన్ అన్నారు. సోమవారం పార్టీ నాయకులతో కలసి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.14లక్షలు కేటాయించారని, వంట గది, ఫ్లోరింగ్, స్టేజ్, మంచినీళ్ల ట్యాంక్, విద్యుత్ మరమ్మతులు కొనసాగుతున్నాయన్నారు. బీజేపీ నాయకుడు అందెల శ్రీరాములు యాదవ్ భోజనం సరిగ్గా పెట్టడం లేదని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కోట్లాది రూపాయలతో జల్‌పల్లి మున్సిపాలిటీని మంత్రి సబితారెడ్డి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగేష్, సత్తిరెడ్డి, గోపాల్ రెడ్డి, అనూష్ గౌడ్, జంగయ్య, నరేందర్, సత్తయ్య పాల్గొన్నారు.

మంత్రి సబితారెడ్డిని కలిసిన కాలనీవాసులు

మహేశ్వరం: మంత్రి సబితారెడ్డిని సోమవారం పట్టణ పరిధిలోని రాఘవనగర్ కాలనీ వాసులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, డిప్యూటీ మేయర్ టి.విక్రమ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి నూతన శుభాకాంక్షలు తెలిపారు. సబితారెడ్డితో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలను మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు వీ చంద్రశేఖర్‌రెడ్డి, అవినాష్, భాస్కర్, ప్రేమ్‌కుమార్, దత్తాత్రేయులు, వాసుదేవ్, మహేశ్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. రోడ్ నంబర్ 2, 3, 4లో వాటర్ పైప్‌లైన్ సమస్య ఉందని, అలాగే స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

అయ్యప్ప మహా పడిపూజ

మహేశ్వరం: స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. సోమవారం మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు కర్రోళ్ల శివలీల - చందు ముదిరాజ్ దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ, ఇరుముడి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వైఎస్ ఎంపీపీ సునితా నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల పర్యవేక్షణ

కందుకూరు: మండలంలోని రాచులూరు, పులిమామిడి గ్రామాల్లో కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ జాయింట్ కమిషనర్ ప్రదీప్‌శెట్టి, ఎస్‌బీఎంలు మురళీధర్, కృష్ణమూర్తి తదితరులు సోమవారం పర్యటించారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను పరిశీలించడానికి ఎస్పవర్‌మెంట్ కేంద్ర బృందం మండలానికి రానుంది. ఇందులో భాగంగా ముందస్తుగా ఆయా గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను సోమవారం వారు పర్యవేక్షించారు. పనులు జరిగిన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి వెంట డీఆర్‌డీఓ పీడీ ఆర్.ప్రభాకర్, ఏపీడీ సక్రియనాయక్, ఎంపీడీఓ వెంకట్రాములు, ఏపీఓ రవీందర్‌రెడ్డి, రవి, రాజాబాబు తదితరులు ఉన్నారు.